క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో ఏఐ తరగతులు ప్రారంభం



విద్యార్థులకు ఏఐ టెక్నాలజీ కోర్సు ఉపయోగాలు తెలియజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ కోర్సు తరగుతులు ప్రారంభించారు. ఇందుకోసం ఈ కళాశాల కోడ్ నెక్షా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ తెలిపారు. తమ కాలేజీలో చేరిన ప్రతి విద్యార్థికీ కంప్యూటర్ శిక్షణ, ఏఐ టెక్నాలజీ కోర్సు నేర్పాలనే ఉద్దేశంతో నెక్షా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. డిగ్రీతో పాటు ఈ కోర్సులో ప్రావీణ్యం పొందిన వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కోడ్ నెక్షా ప్రతినిధులు, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గడువులోగా రెవెన్యూ సమస్యల పరిష్కారం



నేలటూరులో మాట్లాడుతున్న కపిలేశ్వరపురం తహసీల్దార్ చిన్నారావు

కపిలేశ్వరపురం: రెవెన్యూ పరమైన సమస్యలను సంబంధిత అధికారులు నిర్దేశిత సమయం లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు అన్నారు. మండలంలోని నేలటూరులో మంగళవారం భూముల రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ కుక్కల వీరన్న అధ్యక్షతన నిర్వహించిన సభలో భూ యాజమానులు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. భూ హక్కుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారుల సమక్షంలో వాటిని నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, ఎంపీటీసీ రుద్రాక్షల వీరగౌరీ కుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టైలర్స్ సంఘ గౌరవాధ్యక్షుడు 'పసలపూడి' మృతి



పసలపూడి సుబ్బారావు (ఫైల్)

కపిలేశ్వరపురం: అంగరకు చెందిన టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పసలపూడి సుబ్బారావు (88) సోమవారం రాత్రి వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయన పెద్ద కుమారుడు పసలపూడి శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. సుబ్బారావుకు భార్య వెంకటలక్ష్మి, కుమారులు శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు, కుమార్తెలు అనసూయ, ఈశ్వరి ఉన్నారు. ఈయన దీర్ఘకాలం పాటు టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేస్తూ టైలర్ల సంక్షేమానికి కృషి చేశారు. వృద్ధాప్యంతో బాధపడుతున్నప్పటికీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా పని చేస్తున్నారు. ఆయన మృతికి అసోసియేషన్ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో మండలంలోని ఆర్యావటం కుళాయి చెరువు జంక్షన్ వద్ద మంగళవారం లారీ ఢీకొని ఒక యువకుడు గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కపిలేశ్వరపురానికి చెందిన ఇద్దరు ఇరుసుపాల సుబ్బారావు తన బైక్‌పై కాకినాడ వెళుతున్నాడు. కాకినాడ నుంచి ద్రాక్షారామ వైపు వెళుతున్న లారీ ఆర్యావటం కుళాయి చెరువు జంక్షన్ మలుపులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై వెళుతున్న సుబ్బారావు తీవ్ర గాయాలపాలవగా స్థానికులు గమనించి కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

సినిమాలు



అంగర

శ్రీభీమేశ్వర	:	వేట్టయన్
శ్రీవెంకటపద్మావతి	:	విశ్వం

విత్తన తయారీలో రైతుల నిమగ్నం

- సొంతంగా తయారు చేసుకుంటున్న వైనం
- బల్లకట్టు విధానంలో మాసూళ్లు



విత్తనం తయారు చేసుకుంటున్న రైతులు

రాయవరం: విత్తనాలు రైతులే తయారు చేసుకోవాలంటూ వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడం .. నకిలీ విత్తనాలతో మోసపోవడం.. కొనుగోలు చేసిన విత్తనాల్లో కేళీలు అధికంగా రావడం పరిపాటైంది. ఈ క్రమంలో రైతు వారీ విత్తనాలకు డిమాండ్ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులు విత్తనాల తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖరీఫ్‌లో వేసిన రబీ విత్తనాల వరి పంట అక్కరకు రావడంతో ప్రస్తుతం రైతులు విత్తన వరి పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

మూడు శాతం విత్తన వరి సాగు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేపట్టారు. 75 శాతం మేర స్వర్ణ రకాన్ని సాగుచేయగా మిగిలిన 25 శాతం ఎంటీయూ 3626 (బొండాలు), ఎంటీయూ 1,318 తదితర రకాలను సాగు చేశారు. రబీలో అధిక దిగుబడులు ఇచ్చే బొండాలు,1,121 తదితర రకాలను సాగు చేస్తుంటారు. రబీలో సాగు చేసే వరి రకాలకు సంబంధించి విత్తనాలను ఖరీఫ్‌లోనే సాగు చేస్తారు. క్లస్టర్ పరిధిలో సుమారుగా మూడు వేల ఎకరాల్లో విత్తనాల వరిసాగు చేపట్టారు.

బల్లకట్టుకే ప్రాధాన్యం

రైతులు వరి విత్తనాల తయారీలో బల్లకట్టుకే ప్రాధాన్యం ఇస్తారు. కోసిన వరి పనలను బల్లపై కొట్టడం ద్వారా విత్తనాలు సేకరిస్తారు. బల్లకట్టు ద్వారా సేకరిస్తే నాణ్యమైన విత్తనాలు వస్తాయి. ట్రాక్టర్‌తో గాని, పశువులతో గాని తొక్కిస్తే విత్తనాల మొలక శాతం తగ్గిపోతుంది. అలా సేకరించిన విత్తనాలను రైతులు బాగా ఆరబెట్టిన అనంతరం తమ అవసరాలకు వినియోగించుకోగా, మిగిలిన వాటిని సాటి రైతులకు విక్రయిస్తారు. కాగా తయారు చేసుకున్న విత్తనాలను రైతులు జాగ్రత్తగా భద్రపరచాలి. కొత్త గోనె సంచుల్లో భద్రపరిస్తే మంచిది. లేదంటే కనీసం కేళీ విత్తనాలు కలవని సంచుల్లో భద్రపరచాలి.

సొంత విత్తనానికే ప్రాధాన్యం

తమ సొంత విత్తనాలు నాటుకునేందుకే రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంతో పోలిస్తే రైతులు ఇటీవల విత్తన వరిసాగు ఎక్కువగా చేపడుతున్నారు. మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న విత్తనాల్లో ఎక్కువగా కేళీలు వస్తున్నాయి. మొలక శాతం కూడా తక్కువగా ఉంటోంది. ఈ కారణాలతో సొంత విత్తనాలతో వరిసాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. గతంలో రైతులు వరి పరిశోధనా కేంద్రాల్లో తయారు చేసే సీడ్ విత్తనాల కొనుగోలుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇటీవల నిర్వహిస్తున్న పొలంబడుల్లో రైతులే స్వయంగా విత్తనాలు తయారు చేసుకోవాలనే వ్యవసాయ శాఖాధికారుల సూచనలు కూడా అన్నదాతలపై ప్రభావం చూపుతున్నాయి. రైతులు తయారు చేసే వరి విత్తనాలకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. నాణ్యమైన విత్తనాలను రైతుల వద్దే లభించడంతో ధర కూడా అందుబాటులో ఉంటోంది.

ఏటా సొంత విత్తనానికే ప్రాధాన్యం



ఎనిమిది ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. ఏటా సొంత విత్తనాల తయారీకే ప్రాధాన్యం ఇస్తాను. స్వయంగా విత్తనాలు తయారు చేసుకోవడం వలన కేళీలను అరికట్టవచ్చు. అంతేగాకుండా మొలక శాతం బాగుంటుంది. ఏటా రైతువారీ విత్తనాలకే ప్రాధాన్యం ఇస్తాను.

– మేడిశెట్టి వెంకటరమణ, కౌలు రైతు, వెంటూరు, రాయవరం మండలం

కేళీలను ఏరి వేయాలి



రైతులు విత్తన పంట కోసే సమయంలోనే కేళీలను గుర్తించి ఏరి వేయాలి. విత్తనం బాగుంటేనే అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. రైతులు సొంత విత్తనాలను తయారు చేసుకునేలా వ్యవసాయశాఖ చైతన్య పరుస్తోంది. సొంత విత్తనాలను వాడితే తెగుళ్లు, పురుగులు తక్కువగా ఆశించడమే గాకుండా అధిక దిగుబడులకు ఆస్కారం ఉంటుంది. రైతులే విత్తనాలను సొంతంగా తయారు చేసుకోవడం వల్ల నమ్మకం పెరుగుతుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం

మెరుగైన వైద్యాన్ని అందించాలి



ఏరియా ఆసుపత్రిలో నూతన బెడ్స్ ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వైద్యులకు సూచించారు. సీఎస్ఆర్ నిధులతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 50 మంచాలు, పరుపులు, దిండ్లు, 380 దుప్పట్లను ఏర్పాటు చేసిన వార్డును మంత్రి సుభాష్ మంగళవారం ప్రారంభించారు. ఆసుపత్రిలో అందుతున్న సర్జరీలు, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు లేని ఒక యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండటంతో ఆ యువకుడి పరిస్థితిని అతని నాయనమ్మ వివరించడంతో మంత్రి స్పందించి రూ.5 వేలు అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ప్రవీణ్ కుమార్, వైద్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

రామచంద్రపురం: గురువారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరు కావాలిని విజ్ఞప్తి చేశారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



కాపవరం రెవెన్యూ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

కె.గంగవరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని యర్రపోతవరంలో జరుగుతున్న గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఈ గ్రామ సభల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే రెవెన్యూ అధికారులు సంబంధిత సమస్య పరిష్కరిస్తారన్నారు. చాలా వరకు రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారమయ్యాయని ఇంకా గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ దూడల చినబాబు, తహసీల్దార్ మృత్యుంజయరావు, రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాపవరంలో..

రామచంద్రపురం రూరల్: భూముల రీ సర్వే సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని కాపవరంలో సర్పంచ్ యనమదల మంగాదేవి అధ్యక్షతన రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రీ సర్వేలో ఏవైనా తప్పులు జరిగినట్లు అయితే ఈ గ్రామ సభల్లో తమ దృష్టికి తీసుకుని వచ్చినట్లైతే 15 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రామ ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివాలయం గ్రామకంఠం సర్వే నెంబరులో 40 సెంట్ల భూమిలో ఉందని అయితే అదే సర్వే నెంబరులోని మొత్తం 9 ఎకరాల భూమిని ఎండోమెంట్ భూమిగా చూపిస్తుందన్నారు. దీనివల్ల భూములు అమ్ముకోవాలన్నా, కొనాలన్నా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని సదరు భూమిని సబ్ డివిజన్ చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామ సభలో 45 సమస్యలపై అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మైలా నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గీసాల శతకోటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గీసాల సత్యనారాయణ, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వీఆర్వో సత్తిబాబుకి వీడ్కోలు



తనుమళ్లలో వీఆర్వో సత్తిబాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

కాజులూరు: మండలంలోని పెనుమళ్ల రెవెన్యూ పరిధి నుంచి బదిలీపై వెళుతున్న వీఆర్వో పైడిమళ్ల సత్తిబాబుకి స్థానికులు ఘనంగా వీడ్కోలు పలికారు. పెనుమళ్ల, తనుమళ్ల వీఆర్వోగా సుదీర్ఘకాలం పనిచేసిన పైడిమళ్ల సత్తిబాబు సాధారణ బదిలీల్లో భాగంగా నరసాపురపుపేట బదిలీ అయ్యారు. మంగళవారం తనుమళ్ల గ్రామ సచివాలయంలో సర్పంచ్ పోతుల భవాని ఆధ్వర్యంలో స్థానికులు సత్తిబాబును అభినందించి శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలో సత్తిబాబు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కండవిల్లి శ్రీనివాసరావు, దార్ల బాబి, పోతుల భీమరాజు, బోలా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు కిక్కు.. మహిళలకు చిక్కులు



బురుగుంట చెరువు రోడ్డుపై తాగి పడుకున్న మందుబాబు

మండపేట: పట్టణంలోని జనావాస ప్రాంతాల మధ్య మద్యం షాపులు వెలియడంతో పరిసర నివాసితులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పాలసీ పుణ్యమా అని ఎక్కడో మారుమూల దూర ప్రాంతంలో ఉండే వైన్ షాపులను నివాస ప్రాంతాల మధ్య పెట్టారని ప్రజలు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఇళ్ల మధ్యలోకి మద్యం దుకాణాలు వచ్చేయడంతో తెల్లవారగానే మందుతోనే మందుబాబులు ముఖం కడుక్కుంటున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. మహిళల ఆవేదనకు తగ్గట్టుగానే కూటమి ప్రభుత్వంలో మందుబాబుల ప్రవర్తన మారిపోయింది. మద్యం కిక్కు బాగా పని చేస్తుందో ఏమో తెలీదుగానీ పూటుగా తాగి చుట్టుపక్కల వారిని అసౌకర్యానికి గురి చేస్తున్నారు. మంగళవారం బురుగుంట చెరువు వైఎస్సార్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం సమీపంలో ఓ వ్యక్తి మద్యం సేవించి రోడ్డు పైన శవాసనం వేసి పడుకున్నాడు. దీంతో ఆ వైపుగా వెళ్లే మహిళలు, చిన్నారులు, విద్యార్థులు సైతం చూసి విస్తుపోయారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వెంకటాయపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి ఆధ్వర్యంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి నేతృత్వంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం, కుందూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రతాప్ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించారు. కంటి ఆసుపత్రి వైద్యుడు మాధవీలత 92 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 15 మందికి కంటి శస్త్ర చికిత్సలు, 44 మందికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించారు. డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో 104 సిబ్బందితో సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసంశెట్టి శ్యామ్, సచివాలయ ఏఎన్ఎం విజయ, విలేజ్ హెల్త్ అసిస్టెంట్ భవాని, కంటి ఆసుపత్రి కోఆర్డినేటర్ ఏవీవీ సత్యనారాయణ, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

500 మంది నుంచి రక్త నమూనాల సేకరణ



నల్లూరులో రక్త నమూనాను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కపిలేశ్వరపురం: మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని నల్లూరు గ్రామంలో మంగళవారం వైద్యాధికారి కె.విజయ దీపిక ఆధ్వర్యంలో బోధవ్యాధి సర్వే చేపట్టారు. 33 మంది సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి సర్వే చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై బోధ వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు గ్రామంలో 500 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. నమూనాలను రాజమహేంద్రవరంలోని ఫైలేరియా ల్యాబొరేటరీకి పరీక్షలు నిమిత్తం పంపనున్నట్టు వైద్యాధికారి విజయదీపిక తెలిపారు. బోధ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సా పద్ధతులపై ఎంపీహెచ్ఈఓ గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, ఆరోగ్య సహాయకులు ఎస్.రవీంద్రకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేటలో బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వాలు

మండపేట: బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు పట్టణంలో కొనసాగుతున్నాయని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక కలువపువ్వు సెంటర్ వద్ద మంగళవారం కార్మికులతో ఆన్‌లైన్ బీజేపీ సభ్యత్వాలు చేయించారు. బీజేపీ సభ్యత్వాలు పొందిన వారందరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు సూచనలతో తాము రోజూ బీజేపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్నామన్నారు.

పోలీసుల అదుపులో రూ.20 లక్షల నగదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ మంగళవారం సాధారణ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వేగాయమ్మపేట శివారులో మంగళవారం సిబ్బందితో కలసి సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో మారుతీ ఆల్టో కారులో బ్యాగుతో తరలిస్తున్న రూ.20 లక్షల నగదు దొరికిందన్నారు. అయితే వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాత్రివేళల్లో ఇసుక తరలింపు

అయినవిల్లి: శానిపల్లిలంక, కొండుకుదురు గ్రామాల నుంచి రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆ గ్రామాల వీఆర్వోలు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏ విధమైన అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. అలా చేస్తున్న వారిని నిలదీయగా తమపై తిరగబడుతున్నారని తెలిపారు. శానపల్లిలంకలో రైల్వే నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలను, కొండుకుదురులో గోదానది నుంచి ఇసుకను తోడి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మను వివరణ కోరగా ఇసుక తరలించకుండా రీచ్‌ల వద్ద గ్రామ రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



పెనికేరు పంచాయతీ కార్యాలయం వద్ద అంటువ్యాధుల వ్యాప్తిపై వివరాలు సేకరిస్తున్న డీఎల్‌పీఓ రాజు

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల ప్రభావం దృష్ట్యా గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపేట డీఎల్‌పీఓ ఎ.రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి పలు వాటర్ ట్యాంకుల నిర్వహణ, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి తీసుకోవలసిన చర్యలను సిబ్బందికి వివరించారు. వాటర్ ట్యాంకు క్లీనింగ్ చేస్తున్న విధానాన్ని ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. తుపాను ప్రభావం దృష్ట్యా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. అలాగే పెనికేరులో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్, గ్రామ కార్యదర్శులు జె.అయ్యన్న, వి.వేణి, ఎం.విజయారెడ్డి, ఎంపీహెచ్ఏ టి.సుశీల పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నట్టల నివారణ మందు తాగిస్తున్న సర్పంచ్ రమణ, పశువైద్య సిబ్బంది

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా చేయూత అందించడంతో ప్రధాన పాత్ర పోషించే గొర్రెల, మేకలకు వచ్చే సమస్యలపై రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ అన్నారు. మండలంలోని దంగేరులో మంగళవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు ఎటువంటి సమస్య వచ్చిన పశు వైద్యులను సంప్రదించాలని కోరారు. అనంతరం గ్రామాల్లో 400 గొర్రెలు, 200 మేకలకు నట్టల నివారణ మందును తాగించారు. పశువైద్యాధికారి కేవీ రామరాజు, జీవాల పోషకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలం కార్యదర్శులు

కపిలేశ్వరపురం-1	కె.శివచక్రవర్తి	9948970046
కపిలేశ్వరపురం-2	కె.పండు	9441818405
తాతపూడి	బ్రహ్మాజీరావు	9381725156
అంగర-1	ఆర్ఎంవీవీఎస్ ఈశ్వరరావు	9618861999
అంగర-2	మహమ్మద్ అలీ షేక్	9652244131
పడమర ఖండ్రిక	పి.సత్తిబాబు	9676273393
వెదురుమూడి	వై. శారద	8790515028
వల్లూరు	కె.సత్తిబాబు	9959545391
నేలటూరు	పి.మోహన్	8008707882
నిడసనమెట్ట	జి.విజయ్‌కుమార్	9550096513
వడ్లమూరు	పి.వెంకటేశులు	8919435971
నల్లూరు	పి.రమేష్	9618988149
కాలేరు	యు.సుప్రియ	7981281398
అచ్యుతాపురం	జి.దేవీప్రసన్న	550124927
టేకి	కె.రామకృష్ణ	9951480999
టేకి	ఎస్.శ్రీనివాసు	8978306474
కేదారిలంక	కె.యశ్వంత్‌కుమార్	7780276777
మాచర	జి.చినబాబు	99853 84544
కోరుమిల్లి-1	ఆర్ఎస్వీ కామేశ్వరరావు	908852108
కోరుమిల్లి-2	కె.శంకరమూర్తి	9502121667
నాగులచెరువు	కె.యశ్వంత్‌కుమార్	7780276777
వాకతిప్ప	పి.వెంకటేశులు	8919435971
అద్దంకివారిలంక	జి.చినబాబు	9985384544